క్లుప్తంగా

అందుబాటులో వరి విత్తనాలు

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఆ సంఘం చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి విత్తనాలు ఎంటీయూ 1010((30కేజీల బ్యాగ్) రూ. 1040లకు, బీపీటీ 5024 (25 కేజీలబ్యాగ్) రూ. 980, కేఏన్ఎం 118 (30కేజీ బ్యాగ్)రూ.1040లకు విక్రయిస్తున్నట్లు తెలి పారు. రైతుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాడిరైతులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

భువనగిరిటౌన్ : పాడిరైతులకు పెండింగ్ పాల బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజ్ గౌడ్ కోరారు. శుక్రవారం భువనగిరిలో సుందరయ్య భవన్‌లో నిర్వహించిన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడిరైతులకు లీటర్‌కు రూ.5ల ఇన్సెంటీవ్ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మేక అశోక్ రెడ్డి, నాయకులు నరాల చంద్రయ్య, మచ్చ భాస్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వను పూర్తి చేయాలి

ఆత్మకూరు(ఎం) : మోత్కూరు, ఆత్మకూరు (ఎం), మోటకొండూరు ప్రాంతాలకు బునాదిగానికాల్వను పూర్తి చేసి సాగునీరును అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పల ముత్యాలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బునాదిగాని కాల్వను పూర్తి చేయాలని గతంలో ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు. బునాదిగానికాల్వ పాలకుల నిర్లక్ష్యానికి గురవుతుందని ఆయన విమర్శించారు. కాల్వ సకాలంతో పూర్తి చేయకపోవడంతో రైతులు సాగునీటి కష్టాలు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైన కాల్వను పూర్తి చేయనట్లయితే మరోసారి ఆందోళన కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు.

మృతుడి ఆచూకీ లభ్యం

భువనగిరి క్రైమ్ : పట్టణంలోని ఖిల్లా కింద గుర్తు తెలియని మృతదేహం గురువారం లభ్యమవ్వగా శుక్రవారం ఆచూకీ తెలిసింది. మృతుడు ఆత్మకూర్(ఎం) మండల కేంద్రానికి చెందిన పర్కాల లింగయ్య(60). అయితే భువనగిరి మండలంలోని నమాత్‌పల్లిలో బంధువు చనిపోవడంతో అక్కడికి వచ్చినట్లు బంధువులు పేర్కొంటున్నారు. కాగా గత కొద్దిరోజులుగా అతడికి మతిస్థిమితం లేకుండా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

భూదాన్‌పోచంపల్లి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని తెలంగాణ ఉద్యమనేత చింతల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఇళ్ల స్థలాలను ఇవ్వాలని కోరారు. అలాగే అర్హులైన ఉద్యమకారులకు నెలకు రూ. 10వేల ఫించన్, హెల్త్ కార్డులు కూడా ఇవ్వాలన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

ఆత్మకూరు(ఎం) : మహిళలు స్వయం ఉపాధి పథకాలను చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మహిళా సాధికారత జిల్లా బృందం సభ్యులు లిఖిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నాల్గో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన మహిళా సాధికారత కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆడ పిల్ల అని వివక్ష చూడకుండా అన్ని రంగాల్లో ముందుకు పోయే విధంగా ఆడపిల్లలను చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ జ్యోతి, టీచర్లు శ్రీవాణి, ధనమ్మ, జానకి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

భువనగిరిటౌన్ : పట్టణంలోని నల్లగొండ చౌరస్తాలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో శుక్రవారం రాత్రి మంటలు ఒకేసారి చెలరేగాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పక్కనే ఉన్న గృహ యజమానులు భయంతో పరుగులు తీశారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి అధికారులు అక్కడి చేరుకుని మరమ్మతులుచేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఈ ఘటన ఎలా జరిగిందని విద్యుత్ అధికారులు విచారణ చేయగ ఎలుక వెళ్లడంతో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

భువనగిరిటౌన్ : భువనగిరి మైనార్టీ కాంగ్రెస్ నాయకులు మజహార్, అతహార్, లయిక్ అహ్మద్‌ల తండ్రి కైసర్ పటేల్ రెండు రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు సయ్యద్ రాషేద్ హుసెన్, వెంకటేశం, అక్బర్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో నిలువు దోపిడీ

- ఒక బస్తాకు కిలో 300గ్రాములు అధికంగా తూకం
- మళ్లీ మిల్లులో తరుగు పేర కోత
- తీవ్రంగా నష్టపోతున్నామంటున్న రైతులు


కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన బస్తాలు

గుండాల : రైతులు తాము పండించిన పంటలకు ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర పొందాలనే ఆశతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసిన రైతులకు నిరాశే మిగులుతుంది. దళారులకు పండించిన పంటలు విక్రయించి నష్టపోవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పిస్తే అవి అధికారులకు, మిల్లర్లకు, కాంట్రాక్టర్లకు లాభాలు తెచ్చి పెడుతున్నాయే తప్ప రైతులకు ఒరిగిందేమి లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తామన్న ఆశతో ధాన్యాన్ని తీసుకు వస్తే పంట తూర్పార పట్టడానికి కిరాయి యంత్రాలు తూకం వేయడానికి హమాలీ ఖర్చు, పంట ఆరబెట్టుకోవడానికి టార్పాలిన్ ఖర్చు, మిల్లులకు వెళ్లడానికి సెంటర్ ఇన్‌చార్జ్‌లకు, మిల్లుల లారీ యజమానులకు, లారీల కాంట్రాక్టర్లకు ముడుపులు ఇవ్వనిదే పంట వెళ్లడం లేదు. మిల్లులకు వెళ్లిన ధాన్యానికి రకరకాల పేర్లతో క్వింటాల్‌కు 2నుంచి 3కిలోలు, బస్తాకు రూ.5చెల్లించాల్సి వస్తుంది. దీనికి తోడు కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు టార్పాలిన్లు లేకపోవడంతో కిరాయికి తెచ్చి పంటలను తూర్పారబట్టి ప్రభుత్వ నిబంధనల మేరకు కుప్ప చేసినప్పటికీ కొర్రీలు పెడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడంతో రైతులు వర్షాలకు ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడరాని కష్టాలు పడుతున్నారు. మిల్లులకు తరలించిన తరువాత తరుగు తీసి వేస్తుంటే స్థానిక నాయకులను, ప్రజా ప్రతినిధులను, అధికారులను బ్రతిమిలాడి అమ్ముకోవాల్సిన పరి స్థితి వస్తుందని రైతులు వాపోయారు. రైతులను దగా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తూకం వేసిన బస్తాలను సకాలంలో మిల్లులకు తరలించి రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

అన్ని కేంద్రాల్లోనూ..

గుండాల మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 7 కొనుగోలు సెంటర్లను పీఏసీఎస్ ఆధ్వర్యంలో 9 సెంటర్లను ఏర్పాటు చేసి వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ధాన్యం తూకం తగ్గకుండా ఉండటానికి మిల్లర్లు చెప్పిన విధంగా ప్రతి సెంటర్‌లో ఒక బస్తాను 41 కిలో 300 గ్రాముల తూకం వేస్తున్నారు. వాస్తవంగా బస్తా 600 గ్రాములే ఉంటుంది. కానీ 1కిలో 300 గ్రాములు ఒక బస్తాకు తూకం వేస్తే క్వింటాళ్‌కు 3కిలోలు అదనంగా మిల్లులకు వెళ్తుంది. అయినప్పటికీ తరుగు వస్తుందని చెప్పడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు రైతుల కష్టాలు పట్టించుకోవాలని కోరారు. హమాలీ ఖర్చులు క్వింటాల్‌కు రూ.55చొప్పున 100 బస్తాలు తూకం వేస్తే 40కిలోల బస్తాను హమాలీలే తీసుకుంటున్నారు.

మూడు క్వింటాళ్ల 22 కిలోల తరుగు తీశారు



మాసాన్‌పల్లి గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 322 బస్తాల ధాన్యాన్ని విక్రయించాను. లారీలు వచ్చేందుకు తూకం వేసిన బస్తాలను ఎగుమతి కోసం బస్తాకు రూ.5చొప్పున చెల్లించాను. మిల్లులకు వెళ్లిన తరువాత మిల్లు యజమానులు బస్తాకు 1కిలో చొప్పున 322 బస్తాలకు 3క్వింటాళ్ల 22కిలోలు తరుగు తీశారు. పేరుకు మాత్రమే మద్దతు ధర అంటున్నారే తప్ప రైతులకు పెట్టుబడులు కూడా వెళ్లడం లేదన్నారు.

– సంపత్ వెంకట్‌రెడ్డి, రైతు, మాసాన్‌పల్లి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


వలిగొండ : విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

వలిగొండ : డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు అని ఏడీఏ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని వెంకటేశ్వర్ సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్, నరేంద్ర కమీషన్ , బాలాజీ ఫర్టిలైజర్స్, రైతు సేవా కేంద్రం , ధనలక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రికార్డులు పరిశీలించి ఆయన మాట్లాడుతూ వచ్చే సీజన్లో రైతులను మోసగించి నకిలీ విత్తనాలు విక్రయించినట్టితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు కొన్న వెంటనే బిల్లు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి అంజనీ దేవి, ఏ ఓ లు స్వప్న, అరుణ, ఏఈఓలు రైతులు పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

రామన్నపేట : పంటలను సాగుచేసే రైతులు విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ మమత తెలిపారు. శుక్రవారం తుమ్మలగూడెం రైతు వేదికలో వానాకాలం ముందస్తు వ్యవసాయ ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించారు. వేసవిదుక్కుల వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. విరివిగా సేంద్రియ ఎరువులను వాడాలని తెలిపారు. వానాకాలంలో వరి, పత్తిసాగులో వచ్చే తెగుళ్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి పద్మజ ఎఈఓలు వెంకన్న, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ద్వారా సాగునీరందించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

భూదాన్‌పోచంపల్లి : అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాలకు మైసమ్మ కత్వ నుంచి లిఫ్ట్ ద్వారా సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఆ గ్రామాల రైతులు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం మైసమ్మ కత్వ నుంచి లిఫ్ట్‌ద్వారా చౌటుప్పల్ మండలం మల్కాపూర్ చెరువును నింపాలని ప్రతిపాదనలు చేసిందన్నారు. కాని అది కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో సాగునీరందించేందుకు అధికారుల ద్వారా తగిన ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తే చిన్నేటి కింద ఉన్న అంతమ్మగూడెం, దోతిగూడెం, మెహర్ నగర్, జిబ్లక్‌పల్లి తదితర గ్రామాలకు సాగునీటి కొరత తీరి ఆ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, మాజీ సర్పంచ్ బాలెం మల్లేశ్, పగిళ్ల లింగారెడ్డి, గుర్రం సత్యపాల్ రెడ్డి, సుర్కంటి మల్లారెడ్డి, ముద్దం సత్యం, లింగయ్య, బండ మురళి, సుధాకర్, గోవర్ధన్, యాదయ్య, శేఖర్, కిష్టారెడ్డి, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన


రైతులతో మాట్లాడుతున్న అన్నపూర్ణ

వలిగొండ : మండలంలోని జంగారెడ్డి పల్లెలో పల్లె విష్ణువర్ధన్ రెడ్డి ఆయిల్ పామ్ తోటను ఉద్యానవన శాఖ, ఆయిల్‌ఫెడ్ కంపెనీ అధికారులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ తోటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఉద్యానవనశాఖ, పట్టుపరిశ్రమశాఖ అధికారి అన్నపూర్ణ మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగులో పాటించాల్సిన నీటి యాజమాన్య పద్ధతులు, పూలగుత్తుల కత్తిరింపు, అధిక ఉష్ణోగ్రతల నుండి చెట్ల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకం, ఎరువుల యాజమాన్య పద్ధతులు, కొమ్ముపురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలతో పాటు ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ టెక్నికల్ అడ్వైజర్ రాజశేఖర్ రెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి కే. కవిత, ఆయిల్ ఫెడ్ డీసీఓ ప్రవీణ్, ఫీల్డ్ ఆఫీసర్లు ప్రశాంత్, హరీష్, కమలాకర్, మమత, వినయ్, బాలరాజు ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పరిశీలన

తుర్కపల్లి : మండలంలోని మధాపూర్‌లోని హైస్కూల్, మల్కాపూర్‌లోని అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను అదనపు కలెక్టర్ గంగాధర్ శుక్రవారం పరిశీలించారు. పాఠశాలల్లోని అసంపూర్తి పనులు పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శ్యామ్ సుందర్, ఎంపీడీఓ ఝాన్సీ లక్ష్మీబాయి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, సీపీఐ మండల మాజీ కార్యదర్శి బీమగోని నర్సింహ తల్లి బీమగోని నర్సమ్మ (85) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్ ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుర్వి బాలరాజు, మల్లేశ్, యాదగిరి, జంగయ్య పాల్గొన్నారు.

మూడోసారి కేంద్రంలో అధికారం బీజేపీదే


బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్

భూదాన్‌పోచంపల్లి : మూడోసారి కేంద్రంలో బీజేపీదే అధికారమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంతమ్మగూడెంలో 50మంది యువకులు బీజేపీలో చేరారు. వారికి ఆయన కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ప్రధాని మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణలో అత్యధిక పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకొంటామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అబద్దపు హామీలతో అధికారంలోకి వచ్చిందని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి శివకుమార్, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, జిల్లా నాయకుడు సుర్కంటి రంగారెడ్డి, మండల అధ్యక్షుడు గుండ్ల రాజు, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, వస్పరి శ్రీశైలం, వస్పరి నర్సింహ, లింగయ్య, లచ్చయ్య, గణేశ్, నెట్టు రమేశ్ పాల్గొన్నారు.

సేవలందించిన వారిని ప్రజలు విస్మరించరు


మాట్లాడుతున్న ఎంపీపీ రచ్చ కల్పన

మోత్కూరు : ప్రభుత్వ విధుల్లో సేవలందించిన ఉద్యోగులను ప్రజలు విస్మరించరని మోత్కూరు మండల పరిషత్ అధ్యక్షురాలు(ఎంపీపీ) రచ్చ కల్పనలక్ష్మీనర్సింహారెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి, మండల ప్రత్యేక అధికారి బి.యాదయ్య అన్నారు. మోత్కూరు మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ పి.యాదవ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఎస్.రామ్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మానోత్సవ సభ శుక్రవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని మండల పరిషత్ ఆధ్వర్యంలో శాలువాలు కప్పి, జ్ఞాపిక అందజేసి పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పోరెడ్డి మనోహర్‌రెడ్డి, పీఏపల్లి ఎంపీడీవో సీహెచ్.చంద్రమౌళి, ఎంపీఓలు రవూఫ్‌అలీ, ప్రేమలత, వైస్ ఎంపీపీ బుషిపాక లక్ష్మి, ఏపీఓ కరుణాకర్, జూనియర్ అసిస్టెంట్ రచ్చ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్యరంగంలో ఫార్మసీ విద్యార్థులది కీలక పాత్ర

యాదగిరిగుట్ట రూరల్ : వైద్యరంగంలో ఫార్మసీ విద్యార్థులదే కీలక పాత్ర అని స్వామి వివేకానంద కళాశాల డైరెక్టర్ కె. ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని వంగపల్లి గ్రామంలోని స్వామి వివేకానంద ఫార్మసీ కళాశాలలో శుక్రవారం వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీ ఫార్మసీ పూర్తి చేసుకున్న 2020 బ్యాచ్ విద్యార్థులకు, మూడో సంవత్సరం విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. వైద్యరంగంలో ఫార్మసీ విద్య సమాజానికి, విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని డైరెక్టర్ తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ కే. హేమామాలిని మాట్లాడుతూ..కళాశాల తల్లిలాంటిదని, ప్రతీ ఒక్కరూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డా. ఎల్ మత్స్యగిరి, ఏవో, ఈ. వేణుగోపాల్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న రైతుకూలీ సంఘం నేతలు

భువనగిరిటౌన్ : విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందజేస్తూ కొత్త రుణాలు, రైతుబంధు రైతులకు అందజేయాలని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సరిపడా విత్తనాలను సబ్సిడీపై ప్రభుత్వమే అందించాలని ఎరువులను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఫర్టిలైజర్ షాపులలో నకిలీల బెడద అరికట్టి రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడాల సోమయ్య, ఇక్కిరి సహదేవ్, మారుజోడు సిద్దేశ్వర్, పంజాల మురళి, ఇక్కిరి సిద్దులు, బుడిగె లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

చౌటుప్పల్ : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణ కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కానుగుల సత్యవతి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు బంగారిగడ్డ కాలనీలో నిర్వహించిన సన్మానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. 41ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో క్రమశిక్షణతో పని చేశారని కొనియాడారు. నాలుగు దశాబ్దాల తన వృత్తిలో ఎందరో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దారని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిక్క నర్సింహ్మా, కౌన్సిలర్ బాబాషరీఫ్, మురళి, వెంకటాచలపతి, సత్తయ్య, యాదయ్య, మోహన్‌రెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలో శ్రీ పుండరీక భక్త సేవా సమాజం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. పద్మ పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రుద్ర పాండురంగ శాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిట్టిమల్ల లక్ష్మీనారాయణ ఉపాధ్యక్షుడిగా బిట్ల చంద్రశేఖర్, ప్రధానకార్యదర్శిగా చిట్టిపోలు వసంత, సహాయ కార్యదర్శిగా గుండు బాలకృష్ణ, కోశాధికారిగా వలందాసు నారాయణ, డైరెక్టర్లుగా చిక్క మనోహర్, ఆడెపు జ్యోతి, ఆడెపు ఎల్లమ్మ, ఇంజమూరి జానకిరాములు, గర్దాస్ నర్సింహ, ఇంజమూరి యాదగిరి ఎన్నికయ్యారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని భీమనపల్లిలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు.ఈ సదర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో మురుగు అంతా రోడ్ల పైకి వచ్చి చేరుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు నిర్మించాలని లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలకార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాదం విష్ణు, మంచాల మధు, నాయకులు కల్కూరి భిక్షపతి, జంగయ్య, బూరుగు భిక్షపతి, పురుషోత్తంరెడ్డి, జంగారెడ్డి, మల్లేశ్, పాండురంగారెడ్డి, భిక్షపతి, జనార్దన్ రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవం


మోత్కూరు : ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది, ప్రజలు

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాడిచేడు, దాచారం పల్లె దవాఖానాల్లో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'నేను నా జీవితంలో ఏ రకమైన పొగాకు ఉత్పత్తులను ఎప్పుడు ఉపయోగించనని, తిననని' వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రతిజ్ఞ చేస్తూ యువత, ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి హేమంత్‌కుమార్, డాక్టర్ అమరావతి, పబ్లిక్ హెల్త్ నర్స్ టికేఆర్.లక్ష్మి, ల్యాబ్ టెక్నిషియన్ జనార్దన్, ఎంఎల్‌హెచ్‌పీఎస్ దివ్య, సుజాత, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు : జాతీయ పొగాకు నియంత్రణ దినోత్సవంపై మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అవగాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు పూర్తి


చౌటుప్పల్‌లో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక-సుధీర్ దంపతులు

భువనగిరి రూరల్ : మండలంలోని సురేంద్రపురి పంచముఖి హనుమాన్ దేవస్థానంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కుంద ప్రతిభ తెలిపారు. ఉదయం సువర్చల సహిత పంచముఖ హనుమంతుని కల్యాణం, నవగ్రహ హోమం, హనుమాన్ రుద్ర హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే మాసుకుంట ఆంజనేయస్వామి సహిత రాజరాజేశ్వరి స్వామి దేవాలయంలో 1008 తమలపాకులతో విశేష అర్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అమరేందర్‌గౌడ్ తెలిపారు.

చౌటుప్పల్ : మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గణపతిపూజ, ధ్వజారోహణం, ధ్వజస్తంభ పూజలు చేశారు. పట్టణ కేంద్రంలోని 9–10వ వార్డుల పరిధి మారుతీనగర్‌లోని శ్రీపెరుమాండ్ల ఆంజనేయస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ ప్రియాంక-సుధీర్ దంపతులు ముఖ్య అతిధులుగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఉప్పు ఆంజనేయులు, శ్రీనివాస్‌చారి, చంద్రయ్య, శ్రీనివాస్‌చారి, పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో శనివారం నిర్వహించే హనుమాన్ జయంతి వేడుకల్లో ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీపాటిమీది భక్తాంజనేయస్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు సందగళ్ల నాగరాజుగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వేడుకల్లో బాగంగా ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం 06గంటలను భారీగా హనుమాన్ ర్యాలీ ఉంటుందని తెలిపారు.

రామన్నపేట : మండల వ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలకు రంగులు వేసి పూలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు నిర్మించారు. వేడుకల్లో భాగంగా ఆంజనేయస్వామికి అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించి హోమాలు చేయనున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేయుటకు సన్నాహాలు చేస్తున్నారు.

సంఘటితంగా పోరాడాలి

రామన్నపేట : కార్మికులు తమ హక్కుల సాధనకు సంఘటింతంగా పోరాడాలని లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని కొమ్మాయిగూడెంలో ఆ సంఘం ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన అంజమ్మ కుటుంబానికి రూ 29, 500ల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యం , అశోక్‌గౌడ్, బెల్లి అంజయ్య, బుర్ర శ్రీశైలం, బోయపల్లి మల్లేశం, సహదేవ్, స్వామి, పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

భువనగిరి క్రైం : ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన ఘటన మండలంలోని మన్నెవారిపంపులో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం మండలంలోని మన్నెవారిపంపు గ్రామానికి చెందిన విడబోయిన సురేశ్ వ్యవసాయ క్షేత్రం వద్ద గడ్డివాము ప్రమాదవశాత్తు అంటుకుని దగ్ధమైంది. పక్కనే పశువుల కొట్టంలో పశులు కట్టేసి ఉండగా ఈ మంటలకు వాటికి కూడా గాయాలయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు వెంబడి వెళ్తుండగా చెట్లల్లో సిగరెట్ తాగి వేసిఉండవచ్చని, దీంతో గడ్డివాము తగలబడి సుమారు రూ.లక్ష ఆస్థి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

గుండాల : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శివాంజనేయ స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన బుర్ర శివయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శుక్రవారం విలేకరులకు తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా బూరుగు విద్యాసాగర్‌రెడ్డి, సత్యనారాయణ, లక్ష్మి, పూల రామస్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో ఊట్ల భిక్షం, సంపతి రాజిరెడ్డి, నరసింహాచారి, కిష్టయ్య, కొండల్‌రెడ్డి, శ్రీశైలం, వెంకటేష్, వీరస్వామి, యాదగిరి, మహేందర్ తదితరులున్నారు.

కాల్వలోని నీరు దిగువకు వెళ్లేలా..


కాల్వలోని చెత్తాచెదారంను తొలగిస్తున్న జేసీబీ


సిరిపురం శివారులో ధర్మారెడ్డిపల్లి కాల్వలో ప్రవహిస్తున్న నీరు

రామన్నపేట : ధర్మారెడ్డిపల్లి కాలువనీటిని దిగువకు తీసుకు రావడానికి భగీరథ ప్రయత్నం జరుగుతోంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మూలంగా గత ప్రభుత్వ హయాంలో ధర్మారెడ్డిపల్లి కాలువ ఆధునీకరణ పనులు అస్తవ్యస్తంగా సాగి మధ్యలోనే ఆగిపోయాయి. తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో కాలువనీళ్ల కోసం రైతులు కళ్లలో వత్తులు పెట్టుకొని ఎదురు చూస్తున్నారు. రైతుల ఆకాంక్ష మేరకు నకిరేకల్‌ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక చొరవ తీసుకొని కాలువ నీటిని దిగువకు తీసుకు రావడానికి కృషి చేస్తున్నారు. కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నటువంటి చెత్తను, చెట్లను, మట్టి దిబ్బలను తొలగించడానికి ప్రత్యేకంగా యంత్రాలను ఏర్పాటు చేశారు. కాలువవెంట మిషన్లు నిరంతరాయంగా పని చేస్తున్నాయి. రైతులు తమ వంతు సహకారం అందిస్తున్నారు. కాలువలో నీటి ప్రవాహంవల్ల భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉన్నది. నడివేసవిలో కాలువలో నీటిని చూసి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.